సాక్షి వికారాబాద్

మంగళవారం । 9 । ఏప్రిల్ । 2024




శోభాయమానంగా ..

బండవెల్కచర్లలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 8లో▸



తప్పని పాట్లు

కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 9లో▸



న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన పాఠాలు చెప్పేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు అధ్యాపకులు కావాలని తెలిపారు. అర్హత ఉన్న వారు ఈ నెల 15వ తేదీ లోగా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 25 నుంచి మే 2వ తేదీ వరకు.. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అనంతరం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల కోసం వికారాబాద్ రెండు, తాండూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 691 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఇంటర్ పరీక్షల కోసం వికారాబాద్‌లో మూడు, తాండూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1,095 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువు లను అనుమతించరాదని సిబ్బందికి సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సెంటర్‌కు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని ఆదేశించారు. అత్యవసర మందులు, ఏఎన్ఎంను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారికి సూచించారు. తాగునీటి వసతి ఉండాలన్నారు. పరీక్ష సమయాల్లో బస్సులను నడిచేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కే రామిరెడ్డి, విద్యుత్ శాఖ డీఈ సత్యనారాయణ, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ రమేష్, పోలీస్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మెడికల్ కాలేజీలో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 10వ తేదీన రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏడు ట్యూటర్, 22 సీనియర్ రెసిడెంట్ల పోస్టులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ పోస్టుల్లో చేరేందుకు అర్హతలు కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

క్రోధినామకు స్వాగతం

ఉగాది పర్వదినాన్ని (క్రోధినామ సంవత్సరం) మంగళవారం ఘనంగా జరుపుకొనేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ పఠనాల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. పండుగకు కావాల్సిన కుండలు, మామిడాకులు, మామిడి కాయలు, వేపపూత, చింతపండు, పూలు తదితర సామగ్రి కొనుగోళ్లతో సోమవారం మార్కెట్లలో సందడి నెలకొంది. – వికారాబాద్

ఉగాది శుభాకాంక్షలు





అనంతగిరి: జిల్లా ప్రజలకు కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలన్నారు. కొత్త ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉజ్వల భవిష్యత్తును అందించాలని ఆకాంక్షించారు.

వడివడిగా అడుగులు

లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా అధికారులు

- నియోజకవర్గాలకు ఈవీఎంల తరలింపు
- మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి
- జిల్లాలో ఓటర్ల సంఖ్య 9,84,068
- పోలింగ్ కేంద్రాలు 1,148



ఈవీఎంల తరలింపునకు సిద్ధం చేసిన వాహనాలు

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇప్పటికే ఓటరు తుది జాబితాను సైతం విడుదల చేశారు. వీవీ ప్యాడ్‌లు,ఈవీఎంలు సిద్ధం చేసి నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్, శాక్రిగేషన్ ప్రక్రియను పూర్తి చేసిన అధికారులు సోమవారం జిల్లా కేంద్రం నుంచి ఈవీఎంలను నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. జిల్లాలో మొత్తం 9,84,068మంది ఓటర్లు ఉండగా 1,148 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ స్టేషన్లకు 25 శాతం అదనంగా బీయూలు (బ్యాలెట్ యూనిట్లు)సీయూ (కంట్రోల్ యూనిట్లు, పోలింగ్ స్టేషన్లకు 40శాతం అదనంగా వీవీ ప్యాట్లు ఆయా కేంద్రాలకు తరలించారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, అడిషనల్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణను సైతం పూర్తి చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్నారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లు, నిర్వహణపై దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమై ఎన్నికలకు అన్ని విధాలా సహకరించాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు

జిల్లాలో మొత్తం 1,148 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందుకోసం 381 బీయూలు,381 సీయూలు, 427 వీవీ ప్యాట్లను తరలించారు. వికారాబాద్‌లో 284 పోలింగ్ స్టేషన్లు ఉండగా 355 ఈయూలు, 355 బీయూలు, 397 వీవీ ప్యాట్‌లు, తాండూరులో 269 పోలింగ్ కేంద్రాలు 08 అలెగ్జరీ పోలింగ్ కేంద్రాలు ఉండగా 346 సీయూలు, 346 బీయూలు, 387 వీవీ ప్యాట్‌లు తరలించారు.కొడంగల్‌లో 275 పోలింగ్ కేంద్రాలు,07 అలగ్జరీ పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందుకోసం 352 సీయూలు, 352 బీయూలు, 394 వీవీ ప్యాట్‌లను తరలించారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు నమోదు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

జిల్లాలో మొత్తం ఓటర్లు 9,84,068 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,86,109 మంది, స్త్రీలు 4,97,220మంది, ట్రాన్స్ జెండర్లు 39 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16,647 మంది, ట్రాన్స్ జెండర్లు 13 మంది ఉన్నారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,43,849 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది, ట్రాన్స్ జెండర్లు ఏడుగురు ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,33,625 మంది, మహిళలు 1,32,639 మంది, ట్రాన్స్ జెండర్లు 9మంది ఉన్నారు. కొడంగల్‌లో 2,42,267 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,19,237మంది, మహిళలు 1,23,020 మంది, ట్రాన్స్ జెండర్లు 10 మంది ఉన్నారు.



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్ నా గుండె చప్పుడు

నాతో కొట్లాడే హక్కు మీకుంది

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- నేను ఏ స్థాయిలో ఉన్నా మీ వాడినే
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గం అంటే నా గుండె చప్పుడని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నాతో కొట్లాడే హక్కు కొడంగల్ ప్రజలకు ఉందన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గం నుంచి 50 వేల మెజారిటీ రావాలని, వంశీచందర్ రెడ్డి గెలిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వికారాబాద్– కృష్ణా రైల్వే లైన్ వస్తుందని తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీలు వస్తాయని అన్నారు. 60 ఏళ్ల క్రితం కొడంగల్‌కు మంత్రి పదవి వరించిందన్నారు. ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కొడంగల్‌కు వచ్చిందన్నారు.

అభివృద్ధిలో పరుగులు తీయిస్తా

తాను గెలిచిన వంద రోజుల్లోపే రూ. 5వేల కోట్లతో ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. త్వరలో కొడంగల్‌కు సిమెంట్ పరిశ్రమలు వస్తాయన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మరిన్ని నిధులతో కొడంగల్‌ను అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు రాయి గనులు ఉన్నాయని, గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలు రాలేదన్నారు. నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కొడంగల్ మండలంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. కొడంగల్ ప్రభుత్వాసుపత్రిని విస్తరించి 220 బెడ్ల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆసుపత్రిగా మారుస్తున్నట్లు చెప్పారు. కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి రూ.6 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

అంతకుముందు ఆయన నివాసంలో నియోజకవర్గంలోని 8 మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరం పంచాగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, కిట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

కేశంపేట: దేశం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీకే అరుణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు అంటూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. వారి మోసపూరిత హామీలను ప్రజలు గుర్తించారని, రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, నర్సింహయాదవ్, మోటే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రత బీజేపీతోనే సాధ్యం

కొత్తూరు: బీజేపీతోనే దేశభద్రత సాధ్యమని పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన కొత్తూరు, నందిగామ మండలాల బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. దేశ ఖ్యాతి, కీర్తిని ప్రపంచదేశాలకు విస్తరించిన ఘనత బీజేపీదే అన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒకే సంతతి పార్టీలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబాయ్య, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగురావునామాజీ, నర్సింహగౌడ్, మోహన్‌నాయక్, నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



తట్టెపల్లి పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న గోపాల్

పెద్దేముల్: రైతులకు ఈ పాస్ ద్వారానే ఎరువులు అందజేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. సోమవారం పెద్దేముల్‌లోని ఎరువుల దుకాణాల్లో, అలాగే తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎంత మంది రైతులకు, ఏ మేరకు ఎరువులు అందజేశారు అనే విషయాలను రిజిస్టర్‌లో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. నాసిరకం విత్తనాలు పంపిణీ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ నజీరొద్దీన్, తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజప్ప, సీఈఓ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

- ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలి
- జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ



హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, చిత్రంలో విజయేంద్ర బోయ

అనంతగిరి: తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి తాగునీటి సరఫరాపై జెడ్పీ సీఈవో, డీపీఓ, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్య ఎదురైతే యుద్ధ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినియోగంలో లేని చేతి పంపులు, బోరు మోటార్లు, పైప్ లైన్లకు వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యను అధిగమించాలని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు.

నీటి నిల్వలపై అవగాహన ఉండాలి

జిల్లాలో నివాస ప్రాంతాలకు సరిపడా నీటి నిల్వలపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, అప్పుడే సమస్యను సత్వరం పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని విజయేంద్ర బోయ అన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో పర్యటించి నీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు తరచూ సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు.

హెల్ప్ డెస్క్ ప్రారంభం

తాగునీటి సమస్యను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. నీటి సమస్య ఉంటే 084162 42136 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.తాగునీటి సమస్యను అధిగమించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అధికారులు బాధ్యతగా పని చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.ప్రజలు కూడా నీటిని వృథా చేయరాదని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, జెడ్పీ సీఈఓ సుధీర్, డీపీఓ జయసుధ, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్ నాయక్, మిషన్ భగీరథ డీఈలు సుబ్రహ్మణ్యం, రత్నప్రసాద్, శశాంక్ మిశ్రా, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, వెంకటయ్య, బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ వేమ్ నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో పార్టీ నియోజకవర్గ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ప్రజలను మోసం చేసే పార్టీలే అన్నారు. కేంద్రంలో తొమ్మిదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. దేశాన్ని కార్పొరేట్ సంస్థల చేతుల్లో పెట్టి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బీజేపీని దేశ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. పరిగి నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గానికి రైలు మార్గం, నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గానికి రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గాన్ని అంగడి చిట్టంపల్లి వరకు పొడిగించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల బరిలో ఉన్న రంజిత్‌రెడ్డికి రాష్ట్రంలోనే అధిక మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన హామీలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో దోమ, కుల్కచర్ల ఎంపీపీలు అనసూయ, సత్యహరిశ్చందర్, ఆయ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి, అభివాదం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

క్లుప్తంగా

చెరువు కబ్జాపై ఫిర్యాదు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాలాల: కబ్జా చెర నుంచి ఊరచెరువు, నక్ష బాటను కాపాడాలని మండలంలోని అన్నసాగర్ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని ఊరచెరువును కొందరూ కబ్జా చేసి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. చెరువుతో పాటు నక్షబాట సైతం ఆక్రమణకు గురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కబ్జా కోరలో చిక్కుకున్న ఊరచెరువు శిఖం, నక్షబాటను సర్వే చేయించి హద్దులు వేయించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న రంజిత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

పరిగి: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో అన్ని మతాలను సమానంగా చూస్తుందన్నారు. రంజాన్ మాసం చాలా పవిత్రమైందని నిష్టతో ఆచరించే ఉపవాస దీక్షలు, దైవప్రార్థనతో మత సామరస్యం, శాంతి వెల్లివిరుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కడ్తాల్: పార్లమెంట్ ఎ న్నికల నేపథ్యంలో మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సాయిలాల్ నాయక్ నూతన పదవిని కట్టబెట్టారు. సోమవారం గిరిజన మోర్చా రాష్ట్ర శాఖ నుంచి వెలువడిన ఉత్తర్వుల్లో ఆయన బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల కోఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయిలాల్ నాయక్ మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని.. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేసేందుకు శక్తి వంచ లేకుండా పనిచేస్తానన్నారు.

భవనాలు లేక.. పాలన సాగక

- ఆరుబయట గ్రామ సభలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

పెద్దేముల్: గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం కొత్తగా పంచాయతీలకు భవనాలు మంజూరు చేసినా అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నా.. కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నా అగమ్యగోచరంగా మారింది. ఆరుబయట, అద్దె భవనాలల్లో నిర్వహిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో చేసిన పనులకు సక్రమంగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్‌లు పనులు చేయడానికి జంకుతున్నారు. దీంతో అద్దె భవనాలు, వాటర్ ఫిల్టర్ షెడ్‌ల్లో పాలన వ్యవస్థను పంచాయతీలు కార్యదర్శులు కొనసాగిస్తున్నారు.

అద్దె భవనాల్లో పాలన

పెద్దేముల్ మండలంలో గతంలో 25 గ్రామ పంచాయతీలు ఉండేది. ప్రభుత్వం ఐదేళ్ల క్రితం గిర్మాపూర్, మారేపల్లితండా, సిద్దన్న మడుగుతండా, ఎర్రగోడుతండా, ఖానాపూర్‌తో పాటు మొత్తం 12 పంచాయతీలను కొత్తగా మంజూరు చేసింది. నూతన పంచాయతీలు ప్రారంభం కావడంతో భవనాలు లేక అప్పట్లో ఆయా గ్రామాల సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ, పాఠశాల లేదా



గిర్మాపూర్‌లో వాటర్ ఫిల్టర్ షెడ్‌లో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యకలాపాలు

అద్దె భవనాలల్లో పాలన కొనసాగించారు. గతేడాది కొత్త పంచాయతీలకు భవనాలు మంజూరు చేశారు. మండలంలోని ఓ పంచాయతీ భవనానికి సుమారు రూ.20 లక్షలకు పైగా నిధులు విడుదల చేశారు. కానీ ఇప్పటివరకు నిర్మాణ పనులు అరకొరగానే చేపట్టారు. దీనికి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

అంగన్‌వాడీలో..

గ్రామానికి ఏ అధికారి వచ్చిన ముందు అడిగేది గ్రామ పంచాయతీ కార్యాలయం. అదే గనుక లేకపోతే గ్రామాలకు వెళ్లిన అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపరని స్థానికులు ఆరోపిస్తున్నారు. గిర్మాపూర్‌లో గతంలో అంగన్‌వాడీ భవనంలో పంచాయతీ కార్యాలయం కొనసాగేది. వారు కూడా ఖాళీ చేయమనడంతో ప్రస్తుతం వాటర్ ఫిల్టర్ కోసం ఏర్పాటు చేసిన షెడ్‌లో భవనాన్ని కొనసాగిస్తున్నారు. బంపపల్లి గ్రామంలో భవనం పనులు పూర్తి గాక అద్దె భవనంలో గ్రామ సభలు



గోట్లపల్లిలో కొనసాగుతున్న నూతన పంచాయతీ భవనం నిర్మాణ పనులు

కొనసాగిస్తున్నారు. ఎర్రగోడుతండాల నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీలకు మంజూరైన పంచాయతీ భవనాలను వెంటనే పూర్తయ్యేలా చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం



నూతన పంచాయతీలకు ప్రభుత్వం కొత్త భవనాలు మంజూరు చేసిన విషయం వాస్తవమే. పనుల ప్రారంభంలో కాస్త ఆలస్యం అయింది. త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి భవనాలపై సమీక్ష నిర్వహిస్తాం.

– జర్నప్ప, ఎంపీడీఓ, పెద్దేముల్

నీటి ఎద్దడి లేకుండా చూడండి

రోడ్డు భవనాల శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయ

పరిగి: నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేకాధికారి విజయేంద్ర బోయ ఆదేశించారు. సోమవారం మండలంలోని జాఫర్‌పల్లి గ్రామంలో ఉన్న నీటిశుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మిషన్ భగీరథ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిశుద్ధి కేంద్రం గురించి మిషన్ భగీరథ అధికారులు ఆమెకు తెలియజేశారు. పరిగి, వికారాబాద్, కొడంగల్, తాండురు నియోజకవర్గాల పరిధిలోని 755 గ్రామాలకు తాగునీటిని ఈ కేంద్రం నుంచే సరఫరా చేస్తారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు రాని సందర్భంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు అధికారులు అన్నివిధాలుగా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. లీకేజీలు, డ్యామేజీలు జరిగితే వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాబు, శ్రీనివాస్, చల్మారెడ్డి, డీఈ సుబ్రమణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటి సరఫరా విధానాన్ని పరిశీలిస్తున్న విజయేంద్ర బోయ

ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలి

కలెక్టర్ నారాయణ రెడ్డి

అనంతగిరి: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులకు సంబంధించి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలో ఉండే అధికారులు ఎక్కువ మంది లేబర్‌ను సమీకరించి బాగా పని చేసే వారికి అవకాశం కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పనిచేసే చోట తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. రైతులను, గ్రామ ప్రజలను సమన్వయ చేసుకుంటూ గ్రామానికి ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో కూలీలు ఉదయమే వెళ్లి 11:30 గంటల వరకు ఇంటికి చేరుకోవాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఎక్కువ మందితో చేయించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీఓలు, ఏపీఓలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

శోభాయమానంగా బ్రహ్మోత్సవాలు



భక్తుల భారీ క్యూలైన్

భక్తులతో కిటకిటలాడుతున్న పాంబండ రామలింగేశ్వర దేవస్థానం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని దేవస్థానంలో 9రోజుల నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం అగ్నిగుండం కార్యక్రమంలో అత్యంత శోభాయమానంగా కొనసాగింది. భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో అగ్నిగుండాలపై నడచి తమ భక్తిని చాటుకున్నారు. మండుటెండల్లో సైతం ఆలయ ప్రాంతంలో భారీ క్యూలైన్లలో నిలుచుని రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్‌పర్సన్ నర్సమ్మరాములు, ఆలయ ఈఓ సుధాకర్‌లు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

బెల్టు షాపులపై అబ్కారీ టీం దాడులు


కుల్కచర్ల: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని చౌడాపూర్ గ్రామంలో పలు దుకాణాలపై సోమవారం దాడులు నిర్వహించారు. ముగ్గురి వద్ద మద్యాన్ని సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశారు. అబ్కారీ శాఖ ప్రత్యేక బృందం సీఐ చంద్రశేఖర్ గ్రామంలో మద్యం విక్రయిస్తున్న శీనయ్య, కేశవులు, శివకుమార్‌లను పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంత మద్యం లభించిందనే విషయాన్ని స్థానిక సీఐ కార్యాలయంలో తెలియజేస్తామని ఆయన తెలిపారు.

పాతకక్షలతో ఒకరి దారుణ హత్య

పగిడిపల్లిలో ఘటన

యాలాల: భూ వ్యవహారంలో తలెత్తిన ఘర్షణ ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఈ సంఘటన మండలంలోని పగిడిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హనుమంతు(45)కు గత కొంతకాలంగా భూ విషయంలో తన దాయాదులతో తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి వద్ద మేకల విషయమై వాగ్వాదం చెలరేగింది. సాయంత్రం వేళ గ్రామ శివారులో బైక్‌పై వెళ్తున్న హనుమంతును దాయాదులు అడ్డుకొని కర్రలతో విచక్షణరహితంగా కొట్టారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ఘర్షణలో మృతుడికి చెందిన బైక్‌ను సైతం నిందితులు ధ్వంసం చేశారు. కాగా హత్య అనంతరం నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ



వాటర్ బాటిళ్లను అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: కొండా సేవలు అభినందనీయమని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో కొనసాగుతున్న జాతరలో కొండా వెంకట రంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా వాటర్ బాటిళ్లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముందుకుసాగుతున్నారని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తున్న కొండాకు మద్దతుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు మైపాల్, మాజీ సర్పంచ్ జానకిరాం, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి సంగెం శ్రీను, ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఆలయాల ముస్తాబు

రాజేంద్రనగర్: ఉగాది పండుగకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పంచాగ పఠనం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే టెంపుల్స్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం పూజల అనంతరం పంచాగ పఠనాన్ని చేపట్టనున్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, ఎర్రబోడ, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి ప్రాంతాల్లోని ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.



జలాలు అడుగంటి.. పంటలు ఎండి

భానుడి ప్రతాపానికి భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీరులేక వరి నిలువునా ఎండిపోతోంది. పెట్టుబడి సైతం రాకపోవడంతో అన్నదాతలు అన్నమో రామచంద్రా.. అంటూ ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని బొంరాస్‌పేట మండలం మూడుమామిళ్లతండాలో ఒకే ప్రాంతంలోని 15 ఎకరాల్లో ఉన్న ఎనిమిది వ్యవసాయ బోర్లు ఇంకిపోవడంతో వరి పైర్లు పశువుల మేతగా మారింది.

– బొంరాస్‌పేట

ఎంత పని చేశావు దేవుడా!

- భర్తతో బైక్‌పై పుట్టింటికి వెళుతుండగా భార్య దుర్మరణం
- తౌర్యానాయక్‌తండాలో విషాదం

బషీరాబాద్: భర్తతో కలిసి బైక్‌పై పుట్టింటికి బయలుదేరిన భార్య మార్గమధ్యలోనే అనంతలోకాలకు చేరింది. ఈ విషాదకర ఘటన బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తౌర్యానాయక్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ రమేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన తారీభాయి(36) భర్త జాదవ్ సంజీవ్‌తో కలిసి ఆదివారం మధ్యాహ్నం కర్ణాటకలోని బొందెంపల్లితండాకు పుట్టింట్లో జరుగుతున్న పూజా కార్యక్రమానికి బయలుదేరారు. అయితే భర్త బైక్‌పై కూర్చున్న తారీభాయి నవల్గా గ్రామ శివారులోని మొండిపెరమళ్ల ఆలయం దగ్గర చేరుకోగానే దేవుడికి మొక్కడానికి రెండు చేతులు జోడించి దండం పెట్టింది. ఈ క్రమంలో పట్టు తప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తల రోడ్డుకు బలంగా తాకడంతో ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. అర్ధగంటలో పుట్టింటికి చేరుకోవాల్సిన ఉండగా ప్రమాదం బారిన పడి భర్త కళ్లెదుటే అనంతలోకాలకు వెళ్లింది. దీంతో భర్త తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై సోమవారం ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన తారీభాయి



పెళ్లి చేసుకోమంటే.. గొంతు కోసుకున్నాడు

ప్రియురాలి ఒత్తిడితో.. పీఎస్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం




ఆకాశ్

మీర్‌పేట: ఇన్‌స్టాగామ్ పరిచయం కాస్త ప్రేమగా మారింది.. పెళ్లి పేరెత్తగానే సదరు యువకుడు ఠాణాలోనే బ్లేడుతో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్రాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలం వెల్లిగుట్ట తండాకు చెందిన ఇస్లావత్ ఆకాశ్ (21) నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అచ్చంపేటకు చెందిన యువతి (19) నందనవనంలో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరిద్దరికి 2022లో ఇన్‌స్టా ద్వారా పరిచయం ఏర్పడింది. అనంతరం ప్రేమ పేరుతో యువతికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఇటీవల యువతి వివాహం చేసుకోవాలని కోరడంతో ఆకాశ్ నిరాకరించాడు. యువతి ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. రెండు రోజుల క్రితం పెద్ద మనుషుల పంచాయితీ పెట్టడంతో యువకుడు పెళ్లికి ఒప్పుకొని తర్వాత మాట మార్చాడు. విసిగిన యువతి మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం సాయంత్రం ఇరువురి బంధువులు పోలీస్‌స్టేషన్‌కు రాగా యువతి బంధువులు ఆకాశ్‌ను పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేయడంతో పెళ్లి ఇష్టం లేదని స్టేషన్‌లోనే బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు వెంటనే యువకుడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతనికి ఎటువంటి ప్రాణాపాయం లేదని.. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాలాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను యాలాల పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని దేవనూరు కాగ్నా నది నుంచి దుబ్బతండాకు ట్రాక్టరులో ఇసుక తరలిస్తుండగా, ముందస్తు సమాచారంతో పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

చికెన్ 65లో పురుగు



పురుగు వచ్చిన చికెన్ బిర్యానీ

శంషాబాద్: పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కినారా గ్రాండ్ హోటల్‌లో వినియోగదారుడు తీసుకున్న చికెన్ 65 బిర్యానీలో పురుగు రావడంతో మున్సిపాలిటీ అధికారులుకు ఫిర్యాదు చేశాడు. దీంతో మున్సిపల్ హెల్త్ అధికారులు అక్కడికి వెళ్లి ఆహార పదార్థాలను పరిశీలించారు. దీంతో సదరు హోటల్ యజమాన్యానికి అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. నాణ్యత లేని ఆహారాన్ని అందించినందుకు హోటల్ యజమాన్యానికి హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య రూ. 10 వేల జరిమానా విధించారు. కల్తీ ఆహార పదార్థాలను అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శ్రీనివాస్ యాదవ్‌కు ఉగాది పురస్కారం

తలకొండపల్లి: ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో అందించిన ఉగాది పురస్కారాలకు వెల్జాల్‌కు చెందిన మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని హ్యాపీ రిసార్ట్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు, నిర్మాత, ఎంఏ రత్నం చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈ సదర్భంగా ఎంఏ రత్నం మాట్లాడుతూ.. శ్రీనివాస్ యాదవ్ చేపట్టిన సేవకార్యక్రమాలను గుర్తించి సామాజిక సేవా విభాగంలో సంఘ సంస్కర్తగా ఎంపిక చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి అంతర్జాతీయ స్థాయిలోనూ అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆయనకు అందజేశారు. అనంతరం శ్రీనివాసుయాదవ్ మాట్లాడుతూ.. ఉగాది పురస్కారంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫిల్మ్ చాంబర్ కార్యదర్శి మోహన్‌గౌడ్, మధు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి జనం మోసపోయారు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీని నమ్మి ప్రజలు మోసపోయారని, తొందరగా వాస్తవాలు అర్థమయ్యాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ సారథ్యంలో పల్లెలు, పట్నాలు శరవేగంగా అభివృద్ధి చెందాయని, ప్రజలు సుభిక్షంగా జీవించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే కరువు వచ్చిందన్నారు. ప్రజలకు తిరిగి అవస్థలు మొదలయ్యాయని తెలిపారు. ఆరు గ్యారంటీల పేరిట ఇచ్చిన 13 హామిలతో పాటు కాంగ్రెస్ మానిఫెస్టో లో పొందుపర్చిన 420 హామీలను కాంగ్రెస్‌పార్టీ అటకెక్కించిందన్నారు. కరెంట్ కోతలు, తాగునీటి ఇబ్బందులు, అభివృద్ధి పనులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడిగా మద్దతు తెలిపేందుకు ప్రజలు సమాయత్తమవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టనున్నారని పేర్కొన్నా. భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ విజయం కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గ రాములు, ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీకి ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూయిస్తున్న నాయకులు

దళిత, ప్రజా సంఘాల డిమాండ్

యాలాల: విచారణ పేరిట మాజీ సర్పంచ్ భర్తను కొట్టిన యాలాల ఎస్ఐ శంకర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని నాగసముందర్ మాజీ సర్పంచ్ కవిత భర్త భీమప్పను అకారణంగా దూషిస్తూ కొట్టారని ఆరోపించారు. భీమప్పతో పాటు అతని తమ్ముడు శ్రీశైలంను సైతం కొట్టాడన్నారు. విచారణ పేరిట మాజీ ప్రజాప్రతినిధి భర్తని సైతం చూడకుండా గ్రామస్తుల సమక్షంలో భీమప్పను ఎస్ఐ తీవ్రంగా కొట్టడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ మేరకు ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితుడు భీమప్పతో పాటు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గప్ప, వెంకటయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు వెంకటయ్య, అంజిలయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే ముస్లింలకు గౌరవం

భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: ముస్లింలకు రంజాన్ అత్యంత పవిత్రమైన పండగ అని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం పండ్లు ఇచ్చి ఉపవాసం విడిపించారు. ఈ సందర్భంగా క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. ముస్లింలను గౌరవించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ప్రతీ రంజాన్‌కు రంజాన్ తోఫా, విందులు ఏర్పాటు చేసి ఒక్క చోటుకు చేర్చామని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాలకు, అన్ని మతాలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల యాదగిరి, జగన్, సుజాత రవీందర్, రైతు సమన్వయ సమితి కన్వీనర్ అంజిరెడ్డి, కర్నె అరవింద్, ముజాకీర్, రమేశ్, జహంగీర్‌లతో పాటు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న క్యామ మల్లేశ్